## సర్వేకు ప్రజలు సహకరించాలి : ఎంపిడివో : మధులత

నర్సాపూర్ రూరల్, నవంబరు 6,ప్రభాతవార్త: ప్రభుత్వం కులగణన సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని, అందుకు ప్రజలు సహకరించాలని నర్సాపూర్ ఎంపీడీవో మధులత తెలిపారు. బుధవారం మండల పరిధి రెడ్డిపల్లి గ్రామంలో కులగణన సర్వే కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. మూడు రోజుల పాటు ఈ సర్వేను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీ,మున్సిపాలిటి పరిధిలోని గ్రామం, పేర్లను కోడ్ రూపంలో సేకరిస్తారని తెలిపారు. వార్డు నంబర్,ఇంటి నంబర్,వీధి పేరు నమోదు చేసి ఇంటికి స్టిక్కర్ అంటిస్తారని తెలిపారు. ఈ నెల 9 నుంచి ప్రభుత్వం ముద్రించిన ఫార్మట్‌లో కుటుంబ వివరాలను ఎన్యుమరేటర్లు సేకరించి నమోదు చేస్తారని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ కుల గణన చేస్తామని గత ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా హామి ఇచ్చామని, ఇచ్చిన హామీని నేరవేరుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గుప్త, మాజీ ఎంపీపీ జ్యోతి సురేష్, నర్సాపూర్ మండల అధ్యక్షుడు మల్లేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

## పశు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి : శ్వేత

జగదేవ్‌పూర్, నవంబరు 6 (ప్రభాతవార్త): ప్రభుత్వం ద్వారా అందించే పశు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జగదేవ్‌పూర్ పశు వైద్యాధికారిణి డాక్టర్ శ్వేత అన్నారు. మండల పరిధిలోని తీగుల్ గ్రామంలో బుధవారం పశు సంవర్ధక శాఖ మరియు పశు గణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 14 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, 22 పశువులకు సాధారణ చికిత్సలు, 6 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స నిర్వహించి మందులు అందజేశారు. అదేవిధంగా 14 లేగ దూడలకు నట్టల నివారణ మందులను తాగించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి శ్వేత మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ద్వారా అందించే సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పశువులకు ముందస్తుగా గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేసుకోవాలని తెలిపారు. తదనంతరం పాడి రైతులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విఏ శ్రీనివాస్, గోపాలమిత్ర సూపర్వైజర్ భాస్కర్‌గౌడ్, ఓఎస్ హరిప్రసాద్, గోపాలమిత్రలు యాదగిరి, సర్వర్‌ఖాన్, గౌరి, కనకయ్య, స్వామి, రైతులు పాల్గొన్నారు.



సమగ్ర కుటుంబ సర్వే స్టిక్కర్‌ను జోగిపేటలో ఓ ఇంటికి అతికిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

## జోగిపేటలో సమగ్ర సర్వేను ప్రారంభించిన మంత్రి

జోగిపేట, నవంబరు 6, ప్రభాతవార్త: రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం అందోలు నియోజకవర్గ కేంద్రమైన జోగిపేటలో ప్రారంభించారు. జోగిపేటలోని 17,18,19 వార్డులలో పర్యటించి ప్రతి వార్డులో రెండు ఇండ్లకు స్టిక్కరింగ్ చేశారు. సమీపంలోని పోచమ్మ దేవాలయంలో పూజలు చేసి ప్రసాదం స్వీకరించారు. అనంతరం ఆ వార్డులకు సంబంధించిన ప్రజలు ఆయన దృష్టికి పలు సమస్యలు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో పాండు, అందోలు పిఏసిఎస్ చైర్మన్ ఎస్.జగన్మోహనరెడ్డి, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్‌రెడ్డి, జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, డాకూరి శంకర్, చిట్టిబాబు, రంగసురేష్‌గుప్త, హరిక్రిష్ణగౌడ్, కాంగ్రెస్ నాయకులు పట్లోల్ల ప్రవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నర్సింగ్ కళాశాలను పరిశీలించిన మంత్రి దామోదర్

అందోలు శివారులో నూతనంగా ఏర్పాటుచేస్తున్న నర్సింగ్ కళాశాలను త్వరలో ప్రారంభం చేయనున్న సందర్భంగా విద్యార్థులు, కళాశాల సిబ్బందికి అవసరమైన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కళాశాలలో ఏమేరకు వసతులు ఉన్నాయి ? ఇంకా ఏమి కావాలనే విషయాలపై ఆయన క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ప్రస్తుతం కళాశాల తరగతులు నిర్వహించనున్న భవనంలో మరికొన్ని టాయిలెట్లు, అలాగే డార్మెటరీ తదితరాలను వెంటనే ఏర్పాటు చేసేలా చూస్తామని కళాశాలకు చెందిన అధికారులకు ఆయన వివరించినట్లు తెలిసింది. త్వరలోనే ఈ కళాశాలలో తరగతులు ప్రారంభించనున్నారు.

## సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి
### కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:



సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదర

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కుల గణనలో భాగంగా బుధవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రాఘవాపూర్‌లో నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేకు క్షేత్ర స్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా సిబ్బందిని అడిగి తెలుసుకొని సర్వే చేస్తున్న తీరును పరిశీలించి ఇంటి యజమానులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించడానికి జిల్లా అధికార యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. 8వ తేదీ వరకు మూడు రోజుల హౌస్ సర్వే నిర్వహించి యజమానుల పేర్లను నమోద చేసి ఇంటింటికి స్టిక్కర్ అతికించడం జరుగుతుందన్నారు. 9వ నుంచి ప్రభుత్వం రూపొందించిన నిర్దిష్టమైన ఫారంలో ఇంటిలోని ప్రతి ఒక్కరి సమగ్ర సామాజిక, విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ కులగణన నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలకు సంపూర్ణ సమాచారాన్ని ఎన్యూమరేటర్లు,సూపర్‌వైజర్లకు అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇంటింటి సర్వే చేయడానికి జిల్లాలో 2538 మంది ఎన్యూమరేటర్లను, 252 సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. సర్వేను పర్యవేక్షణ చేయడానికి మండల స్థాయిలో తహశీల్దార్, ఎంపిడిఓలు, ఎంపిఒలు,నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక అధికారులు, డివిజన్ స్థాయిలో ఆర్డీఓలు, జిల్లా మొత్తంగా జిల్లా అదనపు కలెక్టర్ అధికారిగా ఉంటారని తెలిపారు.ఈనెల చివరి కల్లా సర్వే పూర్తి చేసి ఏరోకారోజు సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చడం జరుగుతుందన్నారు. ఆయన వెంట రూరల్ తహశీల్దార్ వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

## స్కాలర్‌షిప్‌లు, ఫీజ్ రీయంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి : ఆదిత్య

హుస్నాబాద్ టౌన్, నవంబరు 6,ప్రభాతవార్త : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజ్ రియంబర్స్‌మెంట్ రూ. 7 వేల 5 వందల కోట్లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సావుల ఆదిత్య డిమాండ్ చేశారు.బుధవారం రోజున పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పెండింగ్ బకాయిలు చెల్లించాలని ఎబివిపి నాయకులు,విద్యార్థులతో కలసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ రాష్ట్రంలో పాలకులు మారినా విద్యార్థుల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగాన్ని ప్రభుత్వాలు పూర్తిగా నిర్వీర్యం చేయాలని చూడడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి 300 రోజులు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారని గుర్తు చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం ఫీజ్ రియంబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్‌ల విషయంలో స్పందించకుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాకేష్, రాహుల్, చరణ్, బాబు, నవీన్, కళ్యాణి విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎబివిపి నాయకులు, విద్యార్థులు

# కాంగ్రెస్ హయాంలో కులవృత్తులకు పెద్దపీట

### మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ

సంగారెడ్డి టౌన్, నవంబరు 6, ప్రబాతవార్త: కులవృత్తులను ప్రోత్సాహించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాలు అన్నారు. బుధవారం సంగారెడ్డిలోకి కలెక్టరేట్‌లో జిల్లా వెనుక బడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని గీత కార్మికులకు కాటమయ్య కిట్లను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రులు ముఖ్య అతిథులుగా హాజరై టిఎస్ ఐఐసి చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి కార్మికులకు కిట్లను అందచేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, కాంగ్రెస్ హయాంలో కులవృత్తులకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. సంప్రదాయ గీత కార్మికులు ప్రమాదాల బారినపడి ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని, అలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం కార్మికులకు శిక్షణ అందించడంతో పాటు కాటమయ్య కిట్లను ఉచితంగా అందచేస్తోందన్నారు. జిల్లాలోని గీత కార్మిక సహకార సంఘాలు గీత కార్మిక సంఘాల ద్వార ఈత కల్లు, నీరా, తాటికల్లు, అమ్ముకుంటూ 3500 గీతకార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. అంతరించిన పోతున్న కుల వృత్తులను ప్రోత్సహించి ఆధునిక పరిజ్ఞానంతో అభివృద్ధిచేసు కోవాల్సిన అవసర ఉందన్నారు.



గీత కార్మికులకు కాటమయ్య కిట్లను అందచేస్తున్న మంత్రులు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెట్విన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డి, అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి జగదీష్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్, జిల్లా కల్లు గీత కార్మికుల సంఘం అధ్యక్షులు ఆశన్నగౌడ్, కార్యదర్శి రమేష్ గౌడ్, సంఘం నాయకులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.



టేక్మాల్‌లో పర్యటిస్తున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

## సమగ్ర సర్వేకు సమష్టి సహకారం అవసరం
### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

టేక్మాల్, నవంబరు 6,ప్రభాతవార్త: ధాన్యం కొనుగోలు ప్రక్రియ సక్రమంగా నిర్వహించేందుకు పూర్తి సౌకర్యాలు కల్పించడం జరిగిందని, నిర్ణీత గడువులోగా లక్ష్యాన్ని సాధించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా టేక్మాల్ మండలం ఎల్లుపేట్ లోని ఐకెపి వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు సమర్థవంతంగా నిర్వహణకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. తూకం విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమంలో భాగంగా మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేసిన 15 రోజులలోగా సంబంధిత రైతుల ఖాతాలో నగదు జమచేసే విధంగా బ్యాంకర్లు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అనంతరం టేక్మాల్ మండల పరిధిలోని కోరంపల్లి గ్రామంలో జరుగుతున్న సమగ్ర సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం ప్రారంభమైన సామాజిక, ఆర్థిక విద్య,ఉపాధి,రాజకీయ మొదలగు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సందర్భంగా టేక్మాల్ మండలం కోరంపల్లి గ్రామంలో కుటుంబ తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేకుసమిష్టి కృషి అవసరమన్నారు. సర్వే ద్వారా సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని, ఎవరికి సమాచారాన్ని వెల్లడి చేయడం జరగదన్నారు.అందువల్ల ప్రజలు వివరాలు ఇచ్చే విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సర్వే కోసం వచ్చిన ఎన్యుమరేటర్లకు సరైన సమాచారాన్ని ఇచ్చి సహకరించాల్సిందిగా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు చాలా ప్రాధాన్యత ఇస్తుందని, అందువల్ల తప్పు సమాచారం ఇవ్వకుండా సరైన సమాచారాన్ని ఇస్తే భవిష్యత్తులో ఈ సమాచారం వివిధ సంక్షేమ పథకాలకు ఉపయోగపడేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. 6 నుండి 8వ తేది వరకు ఇండ్లను సందర్శించి ఇండ్ల జాబితాను రూపొందించడం జరుగుతుందని, అనంతరం ప్రభుత్వం ఇచ్చే ఫామ్ ప్రకారం వివరాలను సేకరిస్తారన్నారు. సర్వేఫాంలో ఎన్యుమరేటర్లు ఎట్టిపరిస్థితుల్లో తప్పులు నింపవద్దని, ఎవైనా సందేహలు ఉంటే సూపర్‌వైజర్లను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. టేక్మాల్ పశువుల ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్డీవో పిడి శ్రీనివాసరావు, టేక్మాల్ తహసీల్దార్ తులసిరామ్, ఎంపీడీవో విఠల్ అధికారులు పాల్గొన్నారు.

### ఐఎన్‌టియుసి టిఎస్‌ఈఈ 327 జిల్లా ఉపాధ్యక్షుడిగా నాగరాజు

జోగిపేట, నవంబర్ 06, ప్రభాతవార్త: ఐఎన్‌టియుసి టిఎస్ ఈఈ 327 యూనియన్ జిల్లా ప్రాంతీయ నూతన కమిటీలో జోగిపేటకు చెందిన ఎ. నాగరాజు ముదిరాజ్‌కు చోటుదదక్కింది. నాగరాజు ఈ కమిటీలో జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కార్యదర్శి కే.భూపాల్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జిల్లా కమిటీలో తనకు అవకాశం కల్పించినందుకు యూనియన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
### -ఏఓ నాగేందర్‌రెడ్డి

మర్కుక్, నవంబరు 6 (ప్రభాతవార్త): రైతులు ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని దామరకుంట, మర్కుక్ గ్రామాల్లో ములుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, వ్యవసాయాధికారులు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కనకయ్యగౌడ్, దామరకుంట గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింలు, రైతులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ నాగేందర్‌రెడ్డి

# విత్తన చట్టంలో కేంద్రం మార్పులు తీసుకురావాలి

### తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి

సంగారెడ్డి బ్యూరో, నవంబరు 6 ప్రభాతవార్త: కేంద్రం విత్తన చట్టంలో మార్పులు తీసుకురావాలని, ప్రైవేట్ కంపెనీల ఆధిపత్యం తగ్గించడానికి దానికి అనుగుణంగా రాష్ట్రంలో విత్తన చట్టం రావాలని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. విస్తరణ అధికారులతో స్థానికంగా రైతులు వ్యవసాయానికి వాడుతున్న వివిధ రకాల విత్తనాలు, దిగుబడులు, నష్టపోయిన రైతుల వివరాలు, రానున్న కాలంలో సాగులో ఏ విత్తనాలను వినియోగించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ప్రయోజనాలు కాపాడేందుకే విత్తనాభివృద్ధి సంస్థ పనిచేస్తుందని, రాబోయే ఖరీఫ్ సీజన్‌లో సబ్సిడీ విత్తనాలు అందించే చర్యలు చేపడతామని, రైతులు ప్రైవేట్ వ్యాపారస్తుల కొత్త కొత్త ఆకర్షణీయ ప్యాకెట్లతో మోసపూరిత మాటలతో మోసపోకుండా తమ ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా నాణ్యమైన విత్తనాలు ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. విత్తనాభివృద్ధి సంస్థ అందించే విత్తనాలు వాడాలన్నారు. నాణ్యత లేని విత్తనాలు అమ్మితే క్రిమినల్ చర్యలు చేపడుతామని, సొసైటీలు,ఆగ్రోస్‌ల ద్వారా విత్తనాలు విక్రయిస్తామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విత్తనాలను తయారు చేస్తామన్నారు. విత్తన చట్టంలో మార్పు తెస్తామని, ప్రస్తుతం ఉన్న చట్టం రైతాంగానికి వ్యతిరేకంగా ఉందని, కేంద్రం రైతుకు ఉపయోగపడే చట్టం తేవాలన్నారు. రైతుకు పంట నష్టం జరిగినప్పుడు సాయం చేసే చట్టం తేవాలన్నారు. గతంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి వారి ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు ఆ ప్రభుత్వంలోని సీడ్స్ కార్పోరేషన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. మంచి దిగుబడి ఇచ్చే అన్ని రకాల పంటలకు సంబంధించి విత్తనాలను తమ కార్పోరేషన్ ద్వారానే అందించడానికి శతవిధాల కృషి చేస్తున్నామని తెలియజేశారు. ఇందుకుగాను సహకార సంఘాల చైర్మన్‌లు, అధికారులు విశేష కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు మెదక్ గోవింద్, సంగారెడ్డి శివప్రసాద్, సిద్ధిపేట రాధిక, డీసీవోలు మెదక్ కరుణ, సంగారెడ్డి కిరణ్ కుమార్, సిద్ధిపేట నాగేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్లు హనుమంత్ రెడ్డి, అనంతరెడ్డి, తెలంగాణ విత్తన అభివృద్ధి కార్పొరేషన్ మేనేజర్లు సంధ్య, రాజు కోటిలింగం, రైతు సంగ నాయకులు ప్రభాకర్ రెడ్డి, ఏడీఏలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, ఆగ్రో రైతు సేవా కేంద్రం డీలర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

## రెండేళ్లుగా పింఛన్ కోసం వృద్ధురాలి ఎదురుచూపులు
### -పట్టించుకోని అధికారులు, పాలకులు

సిర్గాపూర్, నవంబరు 6, ప్రభాతవార్త: మండల పరిధిలోని అంతర్గం గ్రామానికి చెందిన వృద్ధురాలు భద్రవ్వ వృద్ధాప్య లేదా వితంతు పింఛనుకు నిత్యం తిరుగుతోంది. అధికారులు అలసత్వమో, పాలకులు పట్టింపు లేని తనమో తెలియదు కాని రెండేళ్లుగా పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరిగుతూనే ఉంది.భద్రవ్వ భర్త మొగులప్ప చనిపోయి రెండేళ్లవుతున్నా ఇంత వరకు వితంతు పింఛను మంజూరు చేయకపోవడం అధికారుల పనితీరును తేటతెల్లం చేస్తోంది. మండల పరిషత్ కార్యాలయంలో పలుమార్లు పింఛన్ కోసం తలుపులు తట్టినా పట్టించునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేసింది. సంబంధిత అధికారులు స్పందించి భద్రవ్వకు పింఛ న్ మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

# విధినిర్వహణలో అలసత్వం వహించవద్దు

### అక్రమ రవాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయండి... సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ

హుస్నాబాద్ రూరల్ / అక్కన్నపేట, నవంబరు 6, ప్రభాతవార్త

విధినిర్వహణలో పోలీసులు అలసత్వం వహించవద్దని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా హుస్నాబాద్ సర్కిల్ పరిధిలోకి హుస్నాబాద్, అక్కన్నపేట పోలీస్ స్టేషన్‌లను సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలతో పాటు సీజ్ చేసిన వాహనాలు, రిసెప్షన్‌సెంటర్లు రెండు మండలాలకు సంబంధించిన రూట్ మ్యాప్‌లు,రికార్డు రూములను పరిశీలించారు. అనంతరం సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు ప్రతీ కేసులో పారదర్శకంగా ఇన్విస్టిగేషన్ చేయాలని, స్టేషన్‌కు వచ్చే ప్రతీ దరఖాస్తుకు రిసిప్ట్ ఇవ్వాలన్నారు. సిద్ది పేట జిల్లాను గంజాయి మత్తు పదార్థాలు లేని జిల్లాగా తయారు చేసేందుకు ప్రతీ అధికారి కృషి చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని, రోజు సాయంత్రం విజబుల్ పోలీసింగ్ విధులు నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రమాదాలు తగ్గించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు, రేషన్‌బియ్యం, ఇసుక రవాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని అలాంటి కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహించే వారిపై నిఘా పెంచాలన్నారు. ప్రతీ మండలంలో విపివో వ్యవస్థను పెంచాలని,విలేజ్ పోలీస్ అధికారుల ద్వారా ప్రజల సాధక బాధకాలను తెలుసుకోవాలని చెప్పారు. అలాగే ప్రతి ఒక్కరికి నూతన చట్టాల గురించి తెలిసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలలో పనిచేయని సీసీ కెమెరాలను వెంటనే మరమ్మతులు చేయించాలని, సీసీ కెమోరాలు లేని గ్రామాలలో వెంటనే ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మీ సేవా కేంద్రాల ద్వార వచ్చే దరఖాస్తులను డిస్పోజల్ చేయాలని విధి నిర్వహణలో పోటీతత్వం ఉండాలన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణతో పాటు పోటీతత్వం ఉన్న ప్రతీ అధికారికి ప్రతి నెల రివార్డులు అందజేస్తామన్నారు. రెండు మండలాలలో పాత నేరస్తులు, కేడీలు, డీసీలపై సస్పెక్ట్ షీట్‌లు తరచుగా తనిఖీలు నిర్వహించాలన్నారు. పాత నేరస్తులపై ప్రత్యేక నిఘాతో పాటు పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంచాలన్నారు. హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు ఇచ్చేందుకు వచ్చిన మహిళతో కమిషనర్ మాట్లాడారు. వారి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎస్ఐ తోట మహేష్, సీఐ శ్రీనివాస్‌లకు సూచించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎసిపి వాసాల సతీష్, సీఐ కోంద్ర శ్రీనివాస్, ఎస్బి ఇన్‌స్పెక్టర్ ఎర్రల కిరణ్, సిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, కోర్టు లైజనింగ్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, ఎస్ఐలు తోట మహేష్, విజయ్‌భాస్కర్, అభిలాష్, సీసీ నితిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




హుస్నాబాద్ పోలీసులతో పోలీస్ కమిషనర్ అనురాధ

## ఊరేసుకుని యువకుడి ఆత్మహత్య

చిన్నశంకరంపేట, నవంబరు 6,ప్రభాతవార్త: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధి కొర్విపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన ముత్తిగల లాలు(25) ఈ నెల 4వ తేదిన ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. రాత్రయిన ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బందువుల ఇళ్లలో, స్నేహితుల ఇండ్లలో, చుట్టు ప్రక్కల వేతికినా అతని ఆచూకీ లభించ లేదు. లాలు కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహ్యాతకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

చేర్యాల, నవంబరు 6,ప్రభాతవార్త : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు.బుధవారం చేర్యాల మండలం వేచరేణి ఎల్లాదాస్ నగర్‌కు చెందిన మోతే నరేష్ రాంపూర్ గ్రామ శివారులో అక్రమంగా 10 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తున్నాడని నమ్మదగిన సమాచారం జిల్లా టాస్క్‌ఫోర్స్,చేర్యాల పోలీసులకు సమాచారం అందడంతో రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.జిల్లాలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం,వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు



చిన్నశంకరంపేటలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి

## సర్వేకు ప్రజలు సహకరించాలి : మెదక్ ఆర్డీవో

**చిన్నశంకరంపేట, నవంబరు 6,(ప్రభాతవార్త):** సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి సూచించారు. చిన్నశంకరంపేటలో బుధవారం ప్రారంభమైన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మొదలగు సమగ్ర ఇంటింటి సర్వేను పరి శీలించారు. ఈ సందర్భంగా అధికారులు వివరాలు సక్రమంగా నమోదు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అధికారులు వచ్చిన సమయానికి కుటుంబసభ్యుల్లో ఒకరైనా ఇంటి వద్ద ఉండి వివరాలు నమోదు చేయించుకోవాలని, ఆధార్, రేషన్ కార్డులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

## పోషకాహారంతో పిల్లల ఎదుగుదల



చందంపేటలో గ్రామ ఆరోగ్య పోషణ దినం జరుపుతున్న దృశ్యం

**చిన్నశంకరంపేట, నవంబరు 6,(ప్రభాతవార్త):** మంచి పోషకాహారం పిల్లల ఎదుగుదల, అభివృద్ధికి పునాది, పిల్లలు ఆరోగ్యంగా, సంతోషంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మిషన్ స్పెషలిస్ట్ నాగమణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అన్నారు. బుధవారం చందంపేట గ్రామంలోని పల్లె దవఖానాలోని గ్రామ ఆరోగ్య పోషణ దినం సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు తల్లులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మిషన్ స్పెషలిస్ట్ నాగమణి, రమేష్, ఏఎన్ఎం రాజ్యలక్ష్మీ బేటి పడావో,బేటీ బచావో కార్యక్రమం అన్ని హెల్ప్‌లైన్ల గురించి, సుకన్య సమృద్ధి యోజన గురించి గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి ఆరోగ్య లక్ష్మీ పథకం గురించి పిల్లలకు బాలింతలకు అవగాహన కల్పించారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

**చిన్నశంకరంపేట, నవంబరు 6,(ప్రభాతవార్త):** పరిసరాల పరిశుభ్రత బాధ్యత అందరిపై ఉందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు సేవా గుణాన్ని అలవర్చుకోవాలని, విద్యార్థిదశ నుండే సేవాభావం పెంపొందించుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ భాగంగా విద్యార్థులు సమాజ సేవకు అంకితమవ్వాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన పుట్టి రాజు



సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన పుట్టి రాజు

**రామాయంపేట, నవంబరు 6,(ప్రభాతవార్త):** రాష్ట్రంలో ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పుట్టి రాజు ముదిరాజ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ కుమారుడు తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాసాని వీరేష్ సోదరుడు అయినటువంటి కాసాని రాజేంద్రప్రసాద్ వివాహ సందర్భంగా రేవంత్‌రెడ్డిని కలిసి ఆహ్వానపత్రిక ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే ముదిరాజ్‌ల సమస్యలపై వివరించడం జరిగిందని ముఖ్యమంత్రి నివాసంలో కలిసి చర్చించడం జరిగిందని పుట్టి రాజు వివరించారు.

## పేదలకు వరం సిఎం రిలీఫ్ ఫండ్

### జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 6,ప్రభాతవార్త :** పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి అని సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి అన్నారు.బుధవారం హుస్నాబాద్ పట్టణ కేంద్రానికి చెందిన కొంత మంది గతంలో అనారోగ్యానికి గురై ప్రయివేట్ ఆసుపత్రులలో చికిత్స పొంది అయిన కర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన చెక్కులను బుదవారం రోజున గ్రంథాలయ చైర్మెన్ లింగమూర్తి ఆధ్వర్యంలో లబ్దిదారులకు పంపిణీ చేశారు. చెక్కులు పంపిణీ చేసిన వారిలో సింగిల్‌విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య,నాయకులు చిత్తారి రవిందర్,ఎండి హస్సన్,కౌన్సిలర్లు వల్లపు రాజు,సరోజన,కాంగ్రెస్ మాజీ పట్టణ అధ్యక్షులు అక్కు శ్రీనివాస్,పున్న సది,బూరుగు కిష్టస్వామి,పూదరి వరప్రసాద్,కేశవేణి రమేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## శ్రీవిద్యాధరి సన్నిధిలో మూల నక్షత్ర విశేష పూజలు

**వర్గల్, నవంబరు 6 (ప్రభాతవార్త):** వ్రర్గల్ శ్రీవిద్యా సరస్వతి క్షేత్రంలో బుధవారరం మూల నక్షత్ర విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, లక్ష పుష్పార్చన, చండీ హోమం, ప్రత్యేక అలంకరణ తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మూల నక్షత్ర మహోత్సవానికి వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి అంకురార్పణ చేయగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు.

## హై టెన్షన్ విద్యుత్ స్తంభాల నిర్మాణం ఆపివేయాలి

**మర్కుక్, నవంబరు 6 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని గణేష్‌పల్లి గ్రామంలో హైటెన్షన్ విద్యుత్ స్తంభాల నిర్మాణం వెంటనే ఆపివేయాలని స్థానిక తాజా మాజీ సర్పంచ్ మంజుల శ్రీరాములు, గణేష్‌పల్లి గ్రామస్తులు అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గణేష్‌పల్లి గ్రామం మీదుగా భారీ హైటెన్షన్ విద్యుత్ స్తంభాలు నిర్మాణం చేస్తే ప్రజలకు ఇబ్బందిగా మారుతుందని, వెంటనే హైటెన్షన్ స్తంభాలను నిలిపివేయాలని కోరారు. విద్యుత్ స్తంభాలతో వాహనాలకు ఇబ్బందిగా మారిందని, పాత స్తంభాలు కాకుండా కొత్తగా భారీ హైటెన్షన్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడానికి గుంతలు తీస్తున్నారని, ఆ పనులను వెంటనే నిలిపివేయాలని విద్యుత్ అధికారులకు విన్నవించినట్లు తెలిపారు. గ్రామం మీదుగా కాకుండా గ్రామం బయట నుండి హై టెన్షన్ నిర్మాణం చేసుకోవాలని, గ్రామానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని విద్యుత్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ మంజుల శ్రీరాములు, వంటిమామిడి మాజీ డైరెక్టర్ రాందాస్‌గౌడ్, నాయకులు నయీం, రామరాజు, హరిపంతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గణేష్‌పల్లి గ్రామస్తులు

# అధికారులకు ప్రజలు సహకరించాలి: ఎమ్మెల్యే మల్లారెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 6, ప్రభాత వార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటీ సర్వేలో అధికారులకు ప్రజలు సహకారం అందించి పూర్తి వివరాలు తెలుపాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నానగర్ కాలనీలో బుధవారం ఇంటింటీ సర్వే స్టీకర్‌ను ఇంటికి అతికించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందించడానికి ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. నారపల్లికి చెందిన ఎస్‌కె. అంజాద్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన 2 లక్షల చెక్కును లబ్దిదారుడికి అందజేశారు. ఇంటింటీ సర్వే ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డితో పాటు వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జీ తోటకూర వజ్రేశ్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కర్రె రాజేశ్, కౌన్సిలర్లు గొంగళ్ల మహేశ్ కురుమ, సింగిరెడ్డి సాయిరెడ్డి, బాలగోని వెంకటేశ్ గౌడ్, బి. హరిప్రసాద్‌రావు, మెట్టు బాల్‌రెడ్డి, నాయకులు సామల బుచ్చిరెడ్డి, అబ్బవతి నర్సింహ, మోటుపల్లి శ్రీనివాస్, సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మహిళ కాంగ్రెస్ నాయకురాలు ఏర్రమాధవి, ఏర్ర రాజు, బద్దం మల్లిఖార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి సర్వేకు సహకరించాలి

**మేడ్చల్, నవంబరు 6, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్మాత్మక సమగ్ర ఇంటింటి సర్వేను విజయవంతంగా చేపట్టాలని మేడ్చల్ మున్సిపల్ చైర్మన్ దీపికానర్సింహరెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను బుధవారం చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ సర్వే దేశానికి దిక్సూచిగా మారనుంద న్నారు. ఇంటింటికి వచ్చే సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్య క్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు జంగ హరికృష్ణ,గణేష్,శ్రీనివాస్‌రెడ్డి,కౌడె మహేష్,మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి,నాయకులు మల్లేష్ గౌడ్,నర్సింహరెడ్డి, రవీందర్‌రెడ్డి,అధికారులు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్వే అధికారులకు ప్రజలు సహకరించాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**పరిగి, నవంబరు 6, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే బుధవారం ప్రారంభమైన సందర్భంగా పరిగి మున్సిపాలిటీ 5వ వార్డు, సుల్తాన్ పూర్ గ్రామ పంచాయతీలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సమగ్ర కుటుంబ సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే చేస్తున్న అధికారులకు పలుసూచనలం దించి, ప్రజలు వివరాలు వెల్లడించేందుకు భయపడాల్సిన అవసరం లేదని, సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లకు సహకరించాలని ప్రజలకు సూచించారు. ఇంటి యజమాని, కుటుంబ సభ్యుల వివరాలను సరిగ్గా నమోదు చేయాలని, ఇంటి నెంబర్ లేని ఇండ్లు ఉన్నాయా, ఏమైనా సమస్యలున్నాయా అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ సర్వేకు చాలా ప్రాధాన్యత ఇస్తుందని, తప్పుగా సమాచారం ఇవ్వకుండా సరైన సమాచారాన్ని ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ధరణి పట్టాదారు పాస్‌బుక్ వంటివి సిద్ధంగా ఉంచు కుని, ఎన్యుమరేటర్లకు వివరాలందించాలని, సర్వే ఫారంలో ఎన్యుమరేటర్లు ఎట్టి పరిస్థితులలో తప్పులు నింపవద్దని, ఏవైనా సందేహాలు ఉంటే సూపర్వైజర్లు, లేదా మున్సిపల్ కమిషనర్, ఎంపిడిఓలను సంప్రతించి నివృత్తి చేసుకోవాలన్నారు. ఇంటిని సందర్శించినట్లుగా స్టిక్కర్ అతికించాలని, సర్వే ఫారంలో పూర్తి వివరాలను పొందుపరచాలని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రఘురాం నాయక్, తహసిల్దార్ ఆనంద్‌రావు, ఎన్యుమరేటర్లు తదితరులు ఉన్నారు.



సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

## సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

**మేడ్చల్, నవంబరు 6. ప్రభాతవార్త:** కుటుంబ వివరాలతో పాటు పూర్తి సమాచారం కోసం చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ఇంటింటి సర్వేను బుధవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలతో చేపడుతున్న ఈ కార్యక్రమానికి మున్సిపల్ పరిధిలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. అధికారులు, సర్వే సిబ్బంది ఇంటింటికి వచ్చినప్పుడు ప్రజలు వారికి సహకరించి వివరాలు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్వామి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, జైపాల్‌రెడ్డి, సరస్వతి మోహన్‌రెడ్డి, బాల్‌రాజ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## కొర్రెములలో రోగులకు వైద్య సేవలు

**ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 6, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ కొర్రెముల ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర ప్రారంభోత్సవంలో చైర్మన్ బి.కొండల్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. బుధవారం జరిగిన ఆరోగ్యకేంద్ర ప్రారంభోత్సవంలో పూజలు చేసిన అనంతరం మొక్కలు నాటి నీళ్లు పోశారు. మూతపడిన ఆరోగ్యకేంద్రం తిరిగి మాజీ జడ్పీ చైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి చొరవతో తిరిగి ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు ముస్తాబు అయ్యిందని అన్నారు. గ్రామస్థులు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్ శోభన, సౌమ్య, కౌన్సిలర్ గొంగళ్ల మహేశ్ కురుమ, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్ వాణి, వైద్య సిబ్బంది లక్ష్మీ, రాజేశ్వరి, శైలజ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ అసిస్టెంట్‌కు కలెక్టరేట్‌లో నివాళులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు 6, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఇఒ ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంటగా విధులు నిర్వహిస్తున్న జె.లలిత్‌మోహన్ రోడ్డు ప్రమాదానికి గురై హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందటంతో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, కలెక్టరేట్ ఎఒ రాంమోహన్,పలువురు అధికారులు, సిబ్బంది ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసి,నివాళులు అర్పించారు. గత సెప్టెంబరు నెలలో లలిత్‌మోహన్ రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలకు గురైనట్లు, హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు తెలిపారు. ఈ సందర్భంగ డిఇఒ విజయకుమారి, ఎఒ రాంమోహన్‌లు మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరి వాడాలని, మొబైల్ మాట్లాడుతూ చూస్తూ డ్రైవింగ్ చేయకూడదని, వేగం కన్నా ప్రాణం మిన్న అని, డ్రైవింగ్ చేసేటపుడు రోడ్డుపై దృష్టి పెట్టాలన్నారు.



సీనియర్ అసిస్టెంట్ జె.లలిత్‌మోహన్‌కు నివాళులు అర్పించిన అధికారులు, సిబ్బంది

## తూంకుంట మున్సిపాల్టీలో సమగ్ర సర్వే

**శామీర్‌పేట, నవంబరు 6, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం కులగణనకు సర్వే చేపట్టటం చారిత్రాత్మకమని, తెలంగాణలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు శ్రీకారం చుట్టటం ప్రశంసనీయమని టిపిసిసి ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలో ప్రారంభమైన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కులగణన, సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, పలు రకాలుగా సర్వేలు చేపట్టటానికి నిర్ణయం తీసుకోవటం అభినందనీయమన్నారు. బిసిల రిజర్వేషన్లు కూడ దామాషా ప్రకారంగ అందటానికి ఈ సర్వే దోహదపడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి కూడ న్యాయం చేయటానికి కృషి చేస్తుందన్నారు. ప్రతి ఇంట సంక్షేమ పథకాలు అందించటానికి, ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయటానికి ఈ సర్వే వివరాలు దోహదపడనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటి యజమానులు సర్వేకు వచ్చిన వారికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలు యాదవ్, తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, 4వ వార్డు కౌన్సిలర్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షులు వి.మురళిగౌడ్, కాంగ్రెస్ నాయకులు ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, బి.జనార్ధన్‌రెడ్డి, బాబు, ఎం.మల్లేశ్‌యాదవ్, మహిళ అధ్యక్షురాలు బి.నాగమణి, యూత్ అధ్యక్షులు టి.జగదీశ్, ఓబిసి సెల్ ఉపాధ్యక్షులు టిఆర్ రవీందర్‌గౌడ్, పార్టీ నాయకులు శశిధర్‌రెడ్డి, కత్తి రమేశ్, మనోహర్‌రెడ్డి, జి.హరికృష్ణ, టి.జగన్, ఎ.భాను, ఎన్.మల్లేశ్‌గౌడ్, మణిదీప్‌రెడ్డి, కె.శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సర్వేలో పాల్గొన్న టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, కమిషనర్, కౌన్సిలర్

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**పరిగి నవంబరు 6 ప్రభాతవార్త:** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ డిఎస్పి ప్రశాంత్ రెడ్డి అన్నారు. బుధవారం మధ్యాహ్నం పరిగి పట్టణంలో పరిగి ఎస్సై సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజనులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సైబర్ క్రైమ్ డిఎస్పి ప్రశాంత్ రెడ్డి హాజరై ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు సీనియర్ సిటిజన్‌లనే లక్ష్యంగా చేసుకొని నేరాలకు పాల్పడుతున్నారని, సైబర్ నేరగాళ్ల ఫోన్ కాల్‌లకు ఎలాంటి స్పందన ఇవ్వద్దని సూచించారు. ఆన్లైన్లో బ్యాంకు ఖాతా లింకులు వంటివి ఓపెన్ చేయకూడదని, సైబర్ నేరగాళ్ల మాయమాటల ఉచ్చులో పడకుండా, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

# బిసి బిడ్డగా తిరుగుబాటుతోనే ఎమ్మెల్యే అయ్యా: ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

## 0.5 శాతం ఉన్నోళ్లు ప్రజల్ని పాలించడం దౌర్భాగ్యం

**షాద్‌నగర్, నవంబరు 6, ప్రభాతవార్త:** ఏడు శాతం ఉన్నోళ్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ఏళ్ల తరబడి పాలించారు. 0.5 శాతం ఉన్నోళ్లు కూడా పదేళ్లు తెలంగాణను పాలించారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బిసిలు మాత్రం సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగ, ఉపాధిరంగాల్లో వెనుకబాటుకు గురయ్యారని, భవిష్యత్తులో జనాభా దామాషా ప్రకారం అందరికీ సమన్యాయం దక్కాలంటే కులగణన అత్యవసరమని రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సంచలనాత్మక వ్యాఖ్యలు చేశారు. బుధవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఫరూఖ్‌నగర్‌లో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ నరేందర్, మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్న, ప్రత్యేకాధికారి రామారావు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, ప్రజలు కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ, షాద్‌నగర్ అసెంబ్లీ జనరల్ స్థానంలో అట్టడుగు వర్గానికి చెందిన ఒక బిసి బిడ్డగా రాజకీయాల్లో తిరగబడి పోరాటం చేశానని, ఎంతో కష్టపడితే తప్ప ఎమ్మెల్యేపదవి దక్కలేదన్నారు. సమాజంలో తనలాంటి వారు ఎంతో మంది మొదట అవకాశాలు రాక తెరవెనుక ఉండి పోతున్నారని, జనాభా దామాషా ప్రకారం వెనకబడిన వర్గాలకు కూడా సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధిరంగాల్లో ప్రాధాన్యత లభిస్తే ఏనాడో అభివృద్ధి సాధించేవాళ్లమని అన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో ఎంతో సాహసోపేత మైన నిర్ణయాన్ని తీసుకొని రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పెద్దఎత్తున కులగణన సర్వే చేయడం ధైర్యంతో కూడుకున్నదని అన్నారు. ఒక రెడ్డి బిడ్డగా ఆత్మ స్థైర్యంతో ఎవరూ చేయలేని పని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ చేస్తుందని, కులగణన కాంగ్రెస్‌కు తప్ప మరే పార్టీకి సాధ్యం కానిదని అన్నారు. తక్కువ జనాభా ఉన్న వర్గాలు 80 శాతం ఉన్న ప్రజలను పాలించడం నిజంగా దౌర్భాగ్యమని, ఇప్పటికి కూడా గ్రామాల్లో కుల వివక్షత ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫరూఖ్‌నగర్‌లో ఎమ్మెల్యే శంకర్ స్థానిక అధికారులతో కలిసి స్వయంగా ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇండ్ల వద్ద ప్రజలకు కులగణన గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న, ప్రత్యేకాధికారి రామారావు, కౌన్సిలర్లు శ్రావణి, శారద, కృష్ణవేణి, సర్వర్‌పాష, రాయికల్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు బాబర్‌ఖాన్, చెంది తిరుపతి రెడ్డి, రఘు, కృష్ణారెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, గంగ్రాతి బాల్‌రాజ్ గౌడ్, జమృద్‌ఖాన్, ఇబ్రహీం, చంద్రశేఖర్, అగ్గనూరు బస్వం, ముబారక్ ఖాన్, దిలీప్, మురళీమోహన్, బిఆర్ఎస్ నాయకులు పల్లి శేఖర్, చిన్న, చెర్క శివ, తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌లో కులగణన సర్వేలో ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే

## మండలంలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**దోమ, నవంబరు 6, ప్రభాతవార్త:** దోమ మండల పరిధిలోని రాకొండ, దాదాపుర్, దిర్సంపల్లి, ఐనాపుర్, బ్రాహ్మన్‌పల్లి, కిష్టాపుర్ పాలెపల్లి, కొండాయపల్లి గ్రామాల్లో బుధవారం డిసిఎంఎస్ ఇందిరక్రాంతి పథం వారి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మహేష్ బాబు మాట్లాడుతూ నంబర్‌వన్ వరి ధాన్యానికి 2320 రూపాయలు, రెండో రకానికి 2300, సన్న వడ్లకు క్వింటాలుకు అదనంగా 500 రూపాయలు రైతులకు చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. రైతులందరు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలకు తీసుకరావలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మేనేజర్ శ్యామ్ రెడ్డి, పరిగి మేనేజర్ వెంకటయ్య ముదిరాజ్, మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ రావు, ఎపిఎం సురేష్, పంచాయతి కార్యదర్శులు పట్లోళ్ల రాఘవేందర్ రెడ్డి, మాజి సర్పంచ్ వెంకటయ్య, వెంకట్రాంరెడ్డి, సి.శ్రీనివాస్, కొత్త చంద్రయ్య, లక్ష్మీకాంత్ రెడ్డి, వడ్ల సురేందర్, ఇమ్రాన్, బండి వెంకటయ్య, మాజి సర్పంచ్ క్రిష్ణ, శేఖర్, రేషన్ డీలర్ వెంకటయ్య, మహమ్మద్ ఖాన్, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కోట్‌పల్లి అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలి



ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**కోట్‌పల్లి, నవంబరు 6, ప్రభాతవార్త:** కోట్‌పల్లి మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని బిసి, ఎస్సి, ఎస్టి మైనార్టీల సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని అయన నివాసంలో బుధవారం కోట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. కోట్‌పల్లి మండల కేంద్రం చుట్టు పక్కల అన్ని గ్రామాలకు కేంద్ర బిందువుగా ఉన్నందున అన్ని వ్యాపారాలకు అనుగుణంగా ఉన్న కేంద్రం మరింత అభివృద్ధి పరిచేందుకు కృషి చేయాలన్నారు. మండల కేంద్రంలోని ఎస్సి, ఎస్టి, మైనార్టీ బిసి సంఘాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని అయనను కోరారు. ఇందుకు అయన సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, కోట్‌పల్లి మాజీ సర్పంచ్ నక్కల విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ శివానందం, మాజీ ఉప సర్పంచ్ రియాజ్, కోట్‌పల్లి మాజీ మత్స్యశాఖ అధ్యక్షులు నక్కల బందయ్య, వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా రేషన్ బియ్యం అమ్మితే కఠిన చర్యలు

**షాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త:** అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చేవెళ్ల ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు, సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన మహేష్, లింగం వద్ద రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## విద్యార్థులు విద్యను శాస్త్రీయంగా నేర్చుకోవాలి



పాఠశాలలో ఏర్పాటయిన సమావేశంలో మాట్లాడుతున్న విద్యావేత్త దివాకర్‌రెడ్డి

**కోట్‌పల్లి, నవంబరు 6, ప్రభాతవార్త:** విద్యార్థులు విద్యను శాస్త్రబద్ధంగా నేర్చుకోవాలని విద్యావేత్త దివాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం కోట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన పిఎంశ్రీలో భాగంగా 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు మోటివేషనల్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులకు ఎలా ఉత్తీర్ణత సాధించాలి, ఏ విధంగా చదవాలి అనే విషయాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకూడదన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించిన వెంటనే చదివితే మంచిదన్నారు. కష్టంతో కాకుండా ఇష్టంతోనే చదవుకోవాలని అన్నారు. అనంతరం విద్యాధికారి చంద్రప్ప మాట్లాడుతూ, ప్రభుత్వపరంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం,టెక్స్ట్ బుక్స్ అందజేయడం జరిగిందని వారు పేర్కొన్నారు, కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు బుచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు మోహన్, వెంకట్ నర్సింహరెడ్డి, రాంరెడ్డి, యాదవరెడ్డి, తిరుమలయ్య, అంజయ్య, పాల్గొన్నారు.

## సమగ్ర సర్వేలో పాల్గొన్న జడ్పీ సిఈవో

**షాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వేకు ప్రజలందరూ సహకరించాలని జడ్పీ సిఈవో కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో చేపట్టే సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే సమగ్ర సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేకు ప్రజలందరూ సహకరించాలని, సాంఘిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల తదితర అంశాలకు సంబంధించి సంపూర్ణ వివరాలు సేకరిస్తున్నారని, సుమారు 76 రకాల అంశాలకు సంబంధించిన వివరాలు సేకరించి, నిర్దేశించిన కోడ్ పద్ధతి ద్వారా పత్రాలలో నమోదు చేస్తారన్నారు. 6వ తేది నుండి 18వ తేది వరకు ఎన్యుమరేటర్లకు కేటాయించిన గ్రామాల్లో ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తారన్నారు. ప్రజలు సమగ్ర సర్వే సిబ్బందికి తమ కుటుంబం పూర్తి వివరాలను అందజేసి సహకరించాలన్నారు.

## సమగ్ర సర్వే పరిశీలించిన ఎంపిడిఓ

**బొంరాస్‌పేట్, నవంబరు 6, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా బొంరాస్‌పేట్ మండల పరిధిలోని పలుగ్రామాలలో ఇంటింటికి స్టికర్లు వేసే కార్యక్రమాన్ని ఎంపిడిఓ వెంకన్ గౌడ్ పరిశీలించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ సర్వేను చేపడుతుందని చాలా జాగ్రత్తగా సరైన వివరాలను నమోదుచేయాలని ఎన్యుమరేటర్లను అయన సూచించారు. ఈ నెల 6వ తేది నుండి 31వ తేది వరకు మూడు వారాల పాటు ఈ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ఒక్కో ఎన్యుమరేటర్ 6 నుండి 8 కుటుంబాలను ప్రతిరోజు సర్వే చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అంజిల్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ జయకృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్‌రాములు గౌడ్, ఉపాధ్యాయులు గౌరారం గోపాల్, కార్యదర్శి రమేష్, మాజీ సర్పంచ్ శంకర్, శ్రీనివాస్, సుజాత, గౌషియబేగం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఎంపిడిఓ వెంకన్‌గౌడ్


సన్మానిస్తున్న దృశ్యం

## ఉద్యోగులకు పదవీ విరమణ సహజం

**సిద్దిపేట అర్బన్, నవంబరు 6, ప్రభాతవార్త :** ఉద్యోగ నిర్వహణలో ఉద్యోగికి పదవీ విరమణ సహజమని ఏకలవ్య ఎరుకల(వెల్ఫేర్) సంఘం సిద్దిపేట అధ్యక్షుడు కెమ్మసారం రాజేష్‌ఖన్నా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏకలవ్య సంక్షేమ భవనంలో బుధవారం గౌరవాధ్యక్షులు కెమ్మసారం పోచయ్య, మురళి, ఎల్లయ్య, దుర్గయ్యతో కలిసి ఇటీవల టిజిఎస్ ఆర్టీసి డ్రైవర్‌గా పదవీ విరమణ పొందిన కెమ్మసారం ఎల్లయ్యరాజమణి దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కారించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసి సంస్థకు సుదీర్ఘ కాలంగా ఉత్తమ సేవలు అందించిన వ్యక్తి ఎల్లయ్య అన్నారు. ఉత్తమ అవార్డులు సైతం అందుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏకలవ్య ఎరుకల వెల్ఫేర్ సంఘం ప్రతినిధులు కెమ్మసారం నాగరాజు, నర్సింలు, రాజు, నర్సింలు, నవీన్, సంతోష్‌కుమార్, శ్రావణ్‌కుమార్, కూరాకుల చంద్రం, పోచయ్య, పెంటయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు


పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

**సిద్దిపేట అర్బన్, నవంబరు 6, ప్రభాతవార్త:** సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని తోర్నాల వ్యవసాయ పరిశోధన, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డా॥ ఎస్.శ్రీదేవి, డా॥ రమాదేవి, డా॥పల్లవి, సరిత, మండల వ్యవసాయ అధికారులు నరేష్, జయంత్, విస్తరణ అధికారులు వినీల, శివతో కలిసి చిన్నకోడూరు మండల పరిధిలోని మాచాపూర్, సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రావురూకుల గ్రామాలలో వరి, కంది, శనగ, ఉలువలు, వేరు శనగ పంటలన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ప్రస్తుత రబీ సీజన్‌లో వేసుకునే పంటల రకాలపై అవగాహన కల్పించారు. ఆయా పంటలకు తెగుళ్ల సోకినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వినియోగించాల్సిన మందులపై అవగాహన కల్పించారు.

## సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి :ఎస్ఐ


మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్

**కొండపాక, నవంబరు 6, ప్రభాతవార్త :** విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగానికి దూరంగా ఉండి శ్రద్దగా చదువుకోవాలని కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ సూచించారు. బుధవారం లకుదారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాలబారిన పడకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌కు కొత్తనంబర్ల నుండి ఫోన్ చేసినవారికి బ్యాంకు అకౌంట్ నెంబర్లుకాని,ఒటిపి నెంబర్లుకాని చెప్పకూడదన్నారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. బ్యాంకులకు సంబంధించిన మోసాలు ఎమైన జరిగితే వెంటనే ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 1930కు పోన్ చేసి వివరాలు అందించాలని సూచించారు.

## జగదేవ్‌పూర్‌లో ప్రారంభమైన ఇంటింటి సర్వే


సర్వే పూర్తయిన ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న దృశ్యం

**జగదేవ్‌పూర్, నవంబరు 6 (ప్రభాతవార్త):** మండలంలోని అన్ని గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ఇంటింటి సర్వే బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపిడిఓ బి.యాదగిరి మండలంలోని అలిరాజపేట, అనంతసాగర్, నిర్మల్‌నగర్ తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వేలో తప్పులు లేకుండా నమోదు చేయాలని, ప్రతి ఇంటికి సర్వే పూర్తయిన తర్వాత స్టిక్కర్ అంటించాలని తెలిపారు. సర్వేలో కుటుంబానికి సంబంధించిన వివరాలు కుటుంబ యజమాని లేదా కుటుంబసభ్యులు తెలిపిన విధంగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులంకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు నరేష్‌రెడ్డి,, మమత తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వేతో ప్రతి వర్గానికి మేలు

### కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్-చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

**దుబ్బాక(అక్బర్‌పేట భూంపల్లి) నవంబర్6,ప్రభాతవార్త:** సమగ్ర కుటుంబ సర్వేతో ప్రతి వర్గానికి మేలు జరుగుతుందని దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, కుల గణన కార్యక్రమంలో సంబంధిత అధికారులతో కలిసి దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వేతో ప్రతి వర్గానికి మేలు జరుగుతుందని అని అన్నారు. ప్రతి ఒక్కరు బీసీ కుల గణన, సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంతా అధికారులకు పూర్తి సమాచారము ఇచ్చి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, తహస్థీర్ చంద్రశేకర్, ఎంఈఓ ఆంజనేయులు, గ్రామ పంచాయతీ సెక్రెటరీ వంశీ, గ్రామ ఏన్యూమరేటర్ మహేందర్ రెడ్డి, వివిధ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాల్తే వెంకటేశం, కూతురి సుమలత, కూతురి చందు, మంద చంద్రసాగర్, గుండా శంకర్, పాతూరి శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


కుల గణన సమగ్ర సర్వేలో పాల్గొన్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

# ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి : ఆర్డీవో


కుల గణన సమగ్ర కుటుంభ సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో మహిపాల్, తహాశీల్దార్ శ్రీనివాస్

**నర్సాపూర్, నవంబరు 6, ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కులగణన సర్వేలో భాగంగా సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న అధికారులకు ప్రజలు సహకరించాలని నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ అన్నారు. బుధవారం నర్సాపూర్‌లో కులగణన సర్వే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో ఆయన మండల తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్‌మేనేజర్ మధుసూదన్, ఆర్ఐ ఫైజల్‌లతో కలిసి కుల గణన సర్వేను పరిశీలించి ఎన్యుమరేటర్‌లతో కలిసి ఇంటింటికి కుటుంబ సర్వేలో బాగంగా ప్రతి ఇంటికి స్టిక్కర్‌లను అతికించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మహిపాల్ మాట్లాడుతూ సర్వేలో ముందుగా మూడు రోజుల పాటు ఇంటింటికి స్టిక్కర్‌లను అతికించడం జరుగుతుందన్నారు. ఈ నెల 9 నుండి 18 వరకు సమగ్ర ఇంటింటి కుటుంభ సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు. సర్వేలో కుటుంబ వివరాలు సేకరించడం జరుగుతుందన్నారు. ఎన్యుమరేటర్‌లు కుటుంబ వివరాలు పకడ్బందిగా సేకరించి ఎటువంటి తప్పులు లేకుండా ఈ సర్వే ను చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్బంగా ఆయన పలు వార్డులో పర్యటించి కుల గణన కుటుంబ ఇంటింటి సర్వేను పరిశీలించడం జరిగింది. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దావూద్, మున్సిఫల్ సిబ్బంది, ఎన్యుమరేటర్‌లు, ప్రజలు పాల్గొన్నారు.


హరీష్‌రావును సన్మానిస్తున్న శ్రీనివాస్

## హరీష్‌రావుకు ఘన సత్కారం

**చిన్నకోడూరు, నవంబరు 6, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీనివాస ఇండస్ట్రీస్(రైస్ మిల్లు)ను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీషరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా హరీష్‌రావును యజమాని గోవిదారం శ్రీనివాస్ పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సత్కారించారు. ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు సత్యనారాయణరెడ్డి, కొండం రవీందర్‌రెడ్డి, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి : డిపిఎం వాసుదేవ్


జగదేవ్‌పూర్‌లో పిఎంఎఫ్ఎంఈ పథకంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

**జగదేవ్‌పూర్, నవంబరు 6 (ప్రభాతవార్త):** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని సెర్ప్ సిద్దిపేట జిల్లా డిపిఎం వాసుదేవ్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో జగదేవ్‌పూర్, మర్కుక్ మండల ఎస్‌హెచ్‌జి మహిళలకు పిఎంఎఫ్ఎంఈ పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం వాసుదేవ్, ఏపిఎం కిరణ్‌కుమార్‌లు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఆశయంతో ఈ పథకంపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ట్రైనర్ రఘువర్మ, ఏపిఎం వై.ప్రసాద్‌రావు, మర్కుక్, జగదేవ్‌పూర్ మండలాల సిసిలు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

## రాష్టస్థాయి పోటీలకు నలుగురు విద్యార్థులు ఎంపిక


విద్యార్థులను అభినందనాలు తెలుపుతున్న ప్రిన్సిపాల్ తదితరులు

**దుబ్బాక, నవంబరు 6, ప్రభాతవార్త:** హబ్సీపూర్ గ్రామంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ బి.గోపాల్‌రెడ్డి, పీఈటి తరుణ్‌రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతికి చెందిన విద్యార్థులు సూచిత్, శ్రవణ్, కుమార్, బాస్కెట్‌బాల్ పోటీకి, 9వ తరగతికి చెందిన సంజయ్‌కుమార్ ఖోఖో, 10వ తరగతికి చెందిన భాను కబడ్డీ అండర్ 17 విభాగంలో ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డన్ జ్యోతి, భాగ్య, పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయ బృధం, విద్యార్థులు పాల్గొన్నారు.

## జేఏసిని బలోపేతం చేయడానికి పూర్తిస్థాయి కమిటీ

### జేఏసి చైర్మన్ డాక్టర్ రామగళ్ళ పరమేశ్వర్

**చేర్యాల, నవంబర్ 6,ప్రభాతవార్త :** జేఏసిని బలోపేతం చేయడానికే పూర్తి స్థాయి కమిటీలను ఏర్పాటు చేశామని జేఏసి చైర్మన్ డాక్టర్ రామగళ్ళ పరమేశ్వర్ తెలిపారు.బుధవారం చేర్యాల పట్టణ కేంద్రంలోని జేఏసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం జేఏసిని బలోపేతం చేసి ఏడాదిలోపే డివిజన్ సాధించి పూర్వ వైభవం తీసుకువస్తామని అందుకు పూర్తి స్థాయిలో అందరు భాగస్వాములై ఒక దృడమైన సంకల్పంతో జేఏసి పూర్తిస్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు.సమావేశంలో పూర్మ ఆగం రెడ్డి,అందె బీరన్న,అందె అశోక్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రామగళ్ళ పరమేశ్వర్


మాట్లాడుతున్న ఆర్డీవో మహిపాల్‌రెడ్డి

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

### -నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి

**కొల్చారం, నవంబరు 6 ప్రభాతవార్త:** రైతులు నాణ్యత కలిగిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం కొల్చారం, వరిగుంతం, సంగాయిపేట, రంగంపేట గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొల్చారం తహశీల్దార్ మహమ్మద్ గఫార్ మియాతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నాణ్యత కలిగిన వరి ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించాలని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ ప్రణతి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రభాకర్, సీఈవో పార్థిగారి కృష్ణ, చిన్నారపు రాములు, నవీన్ యాదవ్, జితేందర్ రెడ్డి, బిట్ల నర్సింలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్టస్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక


బి.స్వీకర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవి, ఉపాధ్యాయులు

**నర్సాపూర్, నవంబరు 6, ప్రభాతవార్త:** నర్సాపూర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి బి.స్వీకర్ రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ కబడ్డి పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ రవి తెలిపారు. సిద్దిపేట జిల్లా ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన కబడ్డి పోటీల్లో మెదక్ జిల్లా తరపున 68వ ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీ సబ్ జూనియర్ 14 కేటగిరిలో పాల్గొన్నాడని ఆయన తెలిపారు. ఈ పోటీలో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి బి.స్వీకర్ తన ప్రతిభను చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. ఈ నెల 7 నుండి 9 వరకు యాదాద్రి జిల్లా తుర్కపల్లిలో జరిగే ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి కబడ్డి పోటీలో పాల్గొంటాడని తెలిపారు. స్వీకర్ రాష్ట్రస్థాయి కబడ్డి పోటీలకు ఎంపికైనందున ప్రిన్సిపాల్ రవి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ కిషోర్, పిడి లక్ష్మణ్, పిఈటి రాజు.లింగం విద్యార్థిని అబినందించారు.

## మండలంలో ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వే


అల్లాదుర్గంలో ఇంటింటి సర్వేలో స్టిక్కర్‌లను అంటిస్తున్న ఎన్యూమరేటర్లు

**అల్లాదుర్గం, నవంబరు 6, ప్రభాతవార్త:** సమగ్ర కుటుంబ సర్వే మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం ప్రారంభం అయింది. సర్వేలో భాగంగా గ్రామాల్లోని ఇండ్లకు ఎన్యూమరేటర్లు స్టిక్కర్లు అంటించారు. కుటుంబ సర్వేకు వచ్చిన ఎన్యూమరేట్లరు కుటుంబ సభ్యులు తమ వంతు సహకరించాలని మండల అధికారులు మండల ప్రజలకు సూచించారు.

## నాచగిరి క్షేత్రంలో కార్తీకమాస దీపోత్సవం

**వర్గల్, నవంబరు 6 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని నాచగిరి క్షేత్రంలో కార్తీక మాస దిపోత్సవం గత ఐదు రోజులుగా వైభవంగా జరుగుతుంది. ఇందులో భాగంగా బుధవారం మహిళా భక్తులు భగవంతుని నామ స్మరణ చేస్తూ కార్తీక దీపాలు వెలిగించారు. దీపోత్సవ కార్యక్రమంలో భక్తులు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చి పాల్గొనడం జరుగుతుంది. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుధాకర్‌గౌడ్, పాండు, నరేందర్, వేద పండితులు, అర్చకులు, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.


నాచగిరి క్షేత్రం ఆవరణలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

# ప్రజా ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

**కొండపాక, నవంబరు 6, ప్రభాతవార్త :** ప్రజా ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఎం నాయకులు నక్కల యాదవరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని దుద్దెడలో సిపిఎం మండల 3వ మహసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలే ఉపిరిగా సిపిఎం పని చేస్తుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ చేయాలని, రోడ్లు, సాగునీటి కాలువల నిర్మాణం చేపట్టలని, పరిశ్రమలు నిర్మించి యువతకు ఉపాధి అవకాశలు కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు ఎర్రజెండా నీడలో ఉద్యమాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా అమ్ముల బాల్‌నర్సయ్య, సభ్యులుగా మూడోజు కనకచారి, జగపతి నాగరాజు, మీసా ఐలయ్య, తాటోజు రవీంద్ర చారి, కొమురయ్య, ప్రభాకర్ నియమించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బండకింది అరుణ్ కుమార్, చొప్పరి రవి కుమార్, దాసరి ప్రశాంత్, నాయకులు దాసరి బాలమల్లు, గజబింకార్ బాలకిషన్, దొమ్మాట రోడ్ల బెల్లమయ్య, మూత ఎల్లయ్య, నర్సింలు, పోశయ్య, మల్లేశం, లింగయ్య, సుధాకర్, రాజు, శ్రీనివాస్, బాల్‌లక్ష్మి, బర్ర భారతి, లచ్చవ్వ, కళావతి, భాగ్యమ్మ, లక్ష్మి, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కులగణనకు ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను కేటాయించాలి : సత్యకృష్ణ

**కొండపాక , నవంబరు 6, ప్రభాతవార్త :** ప్రభుత్వం ఒంటిపూట బడులను నిర్వహించాలని తీసుకున్న నిర్ణయం సరైంది కాదని టిపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి పొన్నమల్ల సత్యకృష్ణ అన్నారు. బుధవారం ఆయన మంగోల్‌లో మాట్లాడుతూ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ సమగ్ర సర్వే నిర్వహించడానికి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను కేటాయించడం సరికాదన్నారు. ప్రభుత్వం చేపట్టిన కులగణనను వ్యతిరేకం కాదని, ఒంటిపూట బడులు నిర్వహిచడంవల్ల గ్రామాల్లోని ప్రజలు వ్యవసాయ,కూలీ ఇతర పనులుకు పోవడంవల్ల మధ్యాహ్నం బడులు వదిలేయడంతో విద్యార్థులకు భద్రత లేకుండాడాపోతుందని చెరువులు, కుంటల వెంట తిరిగి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నయన్నారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మాత్రమే కుల గణన సర్వే విధులను అప్పగించడంతో విద్యార్థులకు నెలరోజులపాటు విద్యాబోధన సరిగా జరగక అంతరాయం కలుగుతుందన్నారు. సర్వే విధులను ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను కేటాయిస్తే సర్వే త్వరగా తక్కువ సమయంలో జరిగి విద్యార్థులకు అంతరాయంలేని విద్యా అందుతుందన్నారు. అనారోగ్యంగా ఉన్న(దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే) ఉపాధ్యాయులను సర్వే విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని, సీనియర్ ఉపాధ్యాయులకు, ఎల్ఎఫ్ఎల్ (ప్రైమరీ) హెచ్ఎంలను సూపర్‌వైజర్లుగా విధులు కేటాయించాలని అయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి మండల టిపిటిఎఫ్ అధ్యక్షుడు రామచంద్రం, ప్రధాన కార్యదర్శి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు, టై, బెల్టు, షూ వితరణ

**చిన్నకోడూరు, నవంబరు 6, ప్రభాతవార్తన:** మండలపరిధిలోని ఇబ్రహీంనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో టై, బెల్టు, షూ అందించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఎస్.యాదవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. పదో తరగతిలో 10/10 గ్రేడ్ సాధించడానికి ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలన్నారు. నేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రకాష్, ప్రధాన కార్యదర్శి సంజీవులు మాట్లాడుతూ నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడతామన్నారు. హెచ్ఎం కృష్ణమోహన్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమం లో సిద్దెంకి యాదగిరి, రంజిత, బాల్‌నర్సయ్య, మహిపాల్‌రెడ్డి, వినోలియరాణి, చంద్రప్రసాద్, నేస్తం ప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫాం సాగుకు రైతులు ముందుకు రావాలి

**సిద్దిపేట అర్బన్, నవంబరు 6, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బక్రిచెప్యాల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి బి.శ్రీనాథ్ బుధవారం సమావేశం ఏర్పాటు చేసి రైతులకు అయిల్‌ఫాం తోటల సాగుపై అవగాహన కల్పించారు. అయిల్‌ఫాం తోటల సాగుతో రైతులకు కలిగే లాభాలు, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. అయిల్‌ఫాం తోటలు సాగు చేయడానికి రైతులు మందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎఈవో రాజేష్, అయిల్‌ఫెడ్ క్షేత్రస్థాయి అధికారి కీర్తన, రైతులు రాజిరెడ్డి, రఘురాములు, సిద్దిరాములు, శ్రీహరి, సుధీర్, చంద్రం,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడిని పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

**నర్సాపూర్ నవంబరు 6, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని హన్మంతాపూర్‌కు చెందిన నల్ల మల్లేష్ అనారోగ్యంతో బాధపడుతున్నందున బుధవారం మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగ తెలుసుకున్నారు. వైద్యం మంచిగా చేయించుకోవాలని సూచించారు. ఈసమయంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ వెంట కాలనీ వాసులు నల్ల కృష్ణ, మల్లేష్, నాయకులు ఫైజాన్, సైఫ్ అలీ తదితరులున్నారు.

## రౌడీ షీటర్లపై నిరంతరం నిఘా : సిఐ

**సిద్దిపేట అర్బన్, నవంబరు 6, ప్రభాతవార్త :** ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని రౌడీ షీటర్స్ సత్ప్రవర్తనతో మెలగాలని వన్ టౌన్ సీఐ వాసుదేవరావు సూచించారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్స్ ఇండ్లను సందర్శించి వారి వివరాలు, కుటుంబ,స్నేహితుల, చేసిన నేరాలు, ప్రస్తుత వారి జీవన విధానం వివరాలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. సత్ప్రవర్తనతో మెలిగే వారికి పోలీసు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని సూచించారు. తిరిగి మళ్లీ నేరాలకు పాల్పడే రౌడీ షీటర్లపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. రౌడీ షీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. భూ కబ్జాలు, సెటిల్మెంట్లులో తల దూర్చిన,అల్లర్లకు పాల్పడిన,మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందన్నారు. శాంతియుత వాతావరణానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.


రౌడీషీటర్స్ ఇండ్లను సందర్శించి మాట్లాడుతున్న సీఐ వాసుదేవరావు

## చెట్టును ఢీకొని యువకుడి మృతి

**వర్గల్, నవంబరు 6 (ప్రభాతవార్త):** ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో మృతిచెందిన సంఘటన వర్గల్ మండలంలో చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన యావాపురం కిషన్‌గౌడ్(35) అనే వ్యక్తి తుర్కపల్లిలోని ఒక కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రోజులాగే పనికి వెళ్ళి తిరిగి ద్విచక్ర వాహనంపై రాత్రి గ్రామానికి వెళ్తుండగా అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. దీంతో కిషన్‌గౌడ్ అక్కడికక్కడే మృతిచెందగా మృతుని అన్న యావాపురం మల్లేష్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఇద్దరు దొంగలకు మూడేళ్ల జైలుశిక్ష

**వర్గల్, నవంబరు 6 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని గోవిందాపూర్, వేలూర్ గ్రామాలలో వరుస దొంగతనాలకు పాల్పడిన సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం బీబ్యానాయక్ తండా వాసర గ్రామానికి చెందిన జాదవ్ జైరామ్, రాథోడ్‌లకు మూడేళ్ల జైలు శిక్ష విధించడం జరిగిందని గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన టెక్నాలజీ ఉపయోగించి ఎనిమిది కేసుల్లో నిందితులుగా ఉన్న వారి నుండి బంగారు ఆభరణాలు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పరిశోధన పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడం జరిగిందన్నారు. నిందితులపై ఏడు కేసులలో నేరం రుజువైనందున గజ్వేల్ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి బి.ప్రియాంక నేరస్తులకు మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.

## కాలువలో పడి ఇద్దరు వ్యక్తులు దుర్మణం

**నర్సాపూర్ నవంబరు 6, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తున కాలువలో పడి ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన సంఘటన నర్సాపూర్ పట్టణంలోని బుధవారం జరిగింది. ఎస్ఐ లింగం కథనం ప్రకారం...నర్సాపూర్ మండలంలోని కాగజ్ మద్దూర్ గ్రామానికి చెందిన బోగ రాములు(34) అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి నప్పరి నర్సింలు(30) నర్సాపూర్ పట్టణానికి పని నిమిత్తం బైక్‌పై వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో రాయారావు చెరవు కట్టకింద గల కల్వర్టు కాలువ వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి ఈ కాలువలో పడి అక్కడికక్కడే మృతిచెందారని తెలిపారు. అటుగా వెళ్తున్న కొందరు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే సిఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగం సంఘటనా స్థలానికి చేరుకునే సరికి అప్పటికే ఇద్దరు మృతిచెంది ఉన్నారు. ఈ మేరకు మృతుల కుటంబీకులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాలకు పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుల కుటంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ లింగం తెలిపారు.



2కె రన్ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు, విద్యార్థులు

## కందిలో 2 కె రన్

**కంది, నవంబరు 6, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బుధవారం 2కె రన్‌ను నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు నిర్వహించిన 2 కె రన్‌లో పాఠశాల విద్యార్థులు, ఆయా పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు. కందిలోని కార్యాలయం నుంచి కాశీపూర్ చౌరస్తా వరకు రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి రాథోడ్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశం, ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంపిఓ మహేందర్‌రెడ్డి, ఆర్ఐ రంగయ్య, సంగారెడ్డి మార్కెట్ కమిటి చైర్మన్ రాంచందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతీలాల్, నాయకులు చేర్యాల ఆంజనేయులు, రఘుగౌడ్, కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమగ్ర ఇంటి సర్వే పనులకు శ్రీకారం


కార్పొరేటర్ సింధూ ఇంటికి కులగణన స్టిక్కర్ అంటిస్తున్న అధికారులు

**రామచంద్రాపురం, నవంబరు 6, ప్రభాతవార్త:** సమగ్ర ఇంటి సర్వేను రామచంద్రాపురంలోని తన నివాసం నుంచి భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఆదర్శ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ వరకు ఇంటి యజమాని వివరాలు సేకరించి తరువాత 15 రోజులు 75 అంశాలుపై ప్రతి కుటుంబ నుంచి పూర్తి వివరాలు ఎన్యూమరేటర్లు సేకరిస్తారన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఇంటికి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో భారతీ నగర్ వార్డు ఇంచార్జి రమేష్, సూపర్ వైజర్ నారాయణ, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

## చిమన్‌పాడ్‌లో ఛత్రపతి విగ్రహావిష్కరణ

**సిర్గాపూర్, నవంబరు 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిమల్‌పాడ్ గ్రామంలో మహారాష్ట్ర వీరుడు, యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఆవిష్కరణ కార్యక్రమానికి డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా నిర్వాహఖులు శాలువతో సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో చీమల్‌పాడ్ గ్రామ పెద్దలు,యువకులు పాల్గొన్నారు.

**ఛత్రపతి విగ్రహావిష్కరణలో మాజీ ఎమ్మెల్యే**

**సిర్గాపూర్, నవంబరు 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చీమల్‌పాడ్ గ్రామంలో బుధవారం నిర్వహించిన మహారాష్ట్ర వీరుడు, యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యేను ఆవిష్కరణ నిర్వాహకులు శాలువాతో సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవ్‌రావుపాటిల్, నాయకులు యాదవరావు, బసవరాజ్, నారాయణ, బసిరెడ్డి, జ్ఞానపాటిల్, హన్మరెడ్డి, సంతోష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## పూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, నవంబరు 6 ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీదుర్గాభవాని ఆలయంలో, మాఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన శ్రీలలితాదేవి వైభవ మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పాల్గొని శ్రీలలిత దేవి వైభవం పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరితోపాటు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పరశురాం, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సేట్, సాయిసేట్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే...**

నారాయణఖేడ్ మండలం పోతన్‌పల్లి గ్రామానికిచెందిన శాతం సాయిలు కుమారుని వివాహం బుధవారం జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి మాజీఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరి వెంట లింగాపూర్ మాజీ ఎంపీటీసీ రాధాకృష్ణ, గ్రామ మాజీ ఎంపీటీసీ సత్తయ్య, విజయ్, కట్ట గోపాల్, పోతన్‌పల్లి ఆర్ మాజీ సర్పంచ్ కృష్ణ, మాజీ సర్పంచ్ రాములు, నాయకులు మానయ్య, బాగయ్య, పోచయ్య, విఠల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

### -మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

**అమీన్‌పూర్, నవంబరు 6 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా విలీనమైన గ్రామ పంచాయితీల పరిధిలోని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని, ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి, వైస్ చైర్మన్ నందారం నరసింహగౌడ్ తెలిపారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట శ్రీకృష్ణనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్నజనాభాకు అనుగుణంగా ఏర్పాటవుతున్న కాలనీలలో రహదారులు, అంతర్గత మురుగునీటి కాలువలు, మిషన్ భగీరథ మంచినీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ప్రజల సహకారంతోనే సంపూర్ణ అభివృద్ధి సాధ్యం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ సర్పంచి కృష్ణ, కౌన్సిలర్ కల్పన ఉపేందర్‌రెడ్డి, నాయకులు కొల్లూరు యాదగిరి, మాజీ ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కోనేది ఎప్పుడో ?

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్‌రెడ్డి

**శివ్వంపేట, నవంబరు 6(ప్రభతవార్త) :** రైతులు కొనుకోలు కేంద్రాలలో ధాన్యం తెచ్చి 20 రోజులు గడుస్తున్న కొనుగోలు చేయకుండా ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం శివ్వంపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు సుమారు నెలరోజులుగా కొనుగోలు కేంద్రాలకు వడ్లు తీసుకొచ్చిన నేటివరకు సెంటర్లలో వడ్లు కొనుగోలు కాకపోవడం సిగ్గుచేటని ఆయన మండిపడారు. రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయకుండ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాని మహేందర్ రెడ్డి అన్నారు.అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయలని ఆయన అన్నారు. రైతులు వడ్లు ఎండపోయడలకి తెచ్చిన టాపర్ల కిరాయిలు తడిసి మోపడవుతున్న ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడంలేదని 2,3 రోజులో కొనుకోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేమలని లేనిపక్షంలో సిపిఎం అధ్వర్యంలో రైతులతో పెద్ద ఎత్తున్న ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

# సామాజిక న్యాయానికి నాంది కుల గణన

### డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



తొలి దళిత మహిళా సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మను సన్మానిస్తున్న దృశ్యం

**మెదక్ మున్సి పాలిటీ, నవంబరు 6 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ఎన్నికల మెనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా రాష్ట్రప్రభుత్వం చేపట్టిన కులగణన సామాజిక న్యాయానికి నాంది అవుతుందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. కులగణన స్వాగతిద్దాం.. సామాజిక న్యాయాన్ని సాధిద్దామని డీబీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో కుల గణనపై చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుల గణనకు శ్రీకారం చుట్టడం విప్లవాత్మకమైన చ్యలకు అడుగులు వేసి తద్వారా సామాజిక న్యాయ సాధనకు బాటలు వేస్తున్నారన్నారు. కుల గణన సామాజిక, ఆర్థికచ రాజకీయ, విద్య, ఉద్యోగ సమగ్ర కుటుంబ సర్వేలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యమై తమ వివరాలు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమగ్ర సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో ఎన్నికల హామీలో ఎస్సీ,ఎస్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అంబేద్కర్ అభయ హస్తం పేరుతో ప్రతి కుటుంబానికి 12 లక్షల ఆర్థిక సహాయం పథకం నేటికి ప్రారంభించలేదని, ఎస్సీల రిజర్వేషన్ 18 శాతం పెంచుతామనే హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. అబేద్కర్ విద్యానిధి పథకంలో భాగంగా విద్యార్థులకు పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా 40 లక్షలు చెల్లించాలన్నారు. దళితుల అభివృద్ధి, సంక్షేమానికి మారు పేరైన దళితుల అభివృద్ధికి కట్టుబడి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ, సీనియర్ దళిత నాయకులు రామస్వామి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.మల్లేశం, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షులు దుబాషి సంజీవ్, ప్రధానకార్యదర్శి హన్మకొండ దయాసాగర్, జాతీయ మాలమహానాడు జిల్లా అధ్యక్షులు కల్లూరి సంజీవ్, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు మురళిమాదిగ, మాలల పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షులు బొమ్మాల మైసయ్య, ఎమ్మార్పీఎస్ హవేళిఘనపూర్ మండల అధ్యక్షులు సంజీవ్, వివిధ సంఘాల నాయకులు వినోద్ నాయక్, నీరుడి ఇసాక్, రాజన్న, గౌతోజిగూడ చంద్రం తదితరులు పాల్గొన్నారు.

**తొలి దళిత మహిళా సిపిఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మకు డిబిఎఫ్ సన్మానం**

సిపిఎం పార్టీ చరిత్రలోనే తొలి దళిత మహిళా కార్యదర్శిగా ఎన్నికైన నర్సమ్మకు దళిత బహుజన ఫ్రంట్ ఘనంగా సన్మానించింది. బుధవారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్లఓ జరిగిన కుల గణన చైతన్య సదస్సులో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ ఆధ్వర్యంలో నర్సమ్మను సన్మానించి అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతులకు సూచనలు చేస్తున్న పోలీసులు

## రోడ్లపై ధాన్యం వద్దు-ప్రమాదాలకు కారణం కావొద్దు

### -రైతులకు అవగాహన కల్పించిన పోలీసులు

**పాపన్నపేట, నవంబరు 6, ప్రభాతవార్త:** రోడ్లపై ధాన్యం ఆరబోసుకుని రోడ్డుప్రమాదాలకు కారణం కావద్దంటూ ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని యూసుఫ్‌పేట వద్ద రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతులకు ఎస్ఐ పలు సూచనలు, హెచ్చరికలు జారీచేశారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో అటువా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉంటాయని, ఫలితంగా నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయే ఆస్కారం ఉంటుందని గుర్తు చేశారు. రాత్రి వేళలో ధాన్యం కుప్పలపై నల్లని టార్పలిన్ కప్పి ఉంచడం మూలంగా అవి వాహన దారులకు కానరావని, దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పల వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటే సదరు రైతులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు తమ పంట ధాన్యాన్ని రోడ్డుపై కాకుండా ఇతర చోట్ల ఆరబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు బస్వరాజ్, నర్సింలు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

### సిసిఐ ఇన్‌చార్జి పూర్ణచందర్

**నాగల్‌గిద్ద, నవంబరు 6, ప్రభాతవార్త:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సిసిఐ ఇంచార్జి పూర్ణచందర్ రైతులకు సూచించారు. బుధవారం పూర్ణచందర్ విలేఖరులతో మాట్లాడుతూ రైతులు పండించిన పత్తి పంటను దళారులకు అమ్ముకుని ఆగం కావద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తరలించి ఆర్థికంగా లబ్ధిపొందాలని సూచించారు.

## కులగణనను కురుమలు సద్వినయోగం చేసుకోవాలి

**నాగల్‌గిద్ద, నవంబరు 6, ప్రభాతవార్త:** కులగణనలో కురుమలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు సద్వినియోగం చేసుకోవాలని కురుమ సంఘం మండల అధ్యక్షులు శ్రావణ్ సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వేలో కురుమలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సర్వేలో ప్రతి కురుమ కుటుంబం పాల్గొనాలని మండల కురుమలకు శ్రావణ్ సూచించారు.

## బిఆర్ఎస్ సంగం(కె) గ్రామ అధ్యక్షుడిగా జనార్ధన్‌రెడ్డి

**ఝరాసంగం, నవంబరు 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తుమ్మన్‌పల్లి పంచాయతీ మధిర గ్రామం సంగం(కె) గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులుగా పట్లోళ్ల జనార్ధన్‌రెడ్డిని నియమించారు. పార్టీ అభ్యున్నతికి తన వంతు సహకారం అందిస్తానని జనార్ధన్‌రెడ్డి నాయకులు బరోసా ఇచ్చారు.

## మాలల మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

### జాతీయ మాలమహానాడు నియోజకవర్గ కన్వీనర్ కిషోర్

**అక్కన్నపేట, నవంబరు 6, ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాలల మహాపాద యాత్ర ఈనెల 8వ తేదీన హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండలం బాహుపేట గ్రామాని చేరుకుంటుందని ఈ మహా పాదయాత్రలో మాలలు, అనుబంధ కులాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జాతీయ మాలమహానాడు నియోజకవర్గ కన్వీనర్ ఆరే కిషోర్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని అంతకపేట గ్రామంలో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నుండి రిజర్వేషన్లు ఎత్తి వేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. రిజర్వేషన్ల ప్రక్రియలో కొంతమంది దళితుని ముందుపెట్టి మరి కొందరి గొంతు నొక్కాలని చూస్తున్నారన్నారు. ఐక్యంగా ఉన్న దళితుల మధ్యలో చిచ్చు పెట్టి రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్రను అడ్డుకునేంత వరకు మాలలు పోరాటాలు ఆవబోయేది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించే పాదయాత్రకు ఉస్మానియా యూనివర్సిటీ సంపూర్ణ మద్దతు ప్రక టించిందని గుర్తు చేశారు. హుస్నాబాద్ నియోజక వర్గంలోకి అడుగుపెడుతున్న పాదయాత్రకు ఏడు మండలాల మాలలు, మాల ఉపకులాల ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ మీడియా సేల్ కన్వీనర్ జాల శ్రీనివాస్,మీడియా ప్రతినిధి బొడుమల్ల సంపత్, నాయకులు శంకర్, రాజశేఖర్, వెంకటస్వామి, కొమురయ్య, వెంకటయ్య, బిక్షపతి, మురళి, నర్సయ్య, రవి, వెంకటస్వామి, రమేష్, కార్తీక్,రాజు తదితరులు ఉన్నారు.

## ఉమ్మడి మండలంలో ప్రారంభమైన ఇంటింటి సర్వే

**పుల్‌కల్, నవంబరు 6, ప్రభాతవార్త:** ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే ప్రక్రియ ఉమ్మడి పుల్‌కల్ మండలంలో బుధవారం అధికారులు ప్రారంభించారు. ఉమ్మడి మండలంలోని 34 గ్రామ పంచాయితీలు 108 మంది ఎన్యూమరేటర్లను నియమించారు. మూడు రోజులపాటు గ్రామాల్లోని ఇండ్లకు స్టిక్కరు అంటించి యజమాని పేరును నిర్ధారిస్తారన్నారు. ఈ నెల 9వ తారీఖు నుంచి సమగ్రంగా ఇంటింటికి వెళ్లి కుటుంబ సర్వే చేపట్టి పూర్తి వివరాలు సంబంధిత ఫార్మెట్‌లలో నమోదు చేయనున్నారు. బుధవారం అదనపు డిఆర్‌డిఓ, మండల ప్రత్యేక అధికారి బాలరాజు, ఇంచార్జి ఎంపిడిఓ శ్రీకాంత్‌లు శివంపేటలో ఇంటింటికి సర్వేను పరిశీలించారు.

## సిసి రోడ్డు పనులను పరిశీలించిన చైర్మన్

**ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 6,ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ నారపల్లి బృందావన్ కాలనీలో పదిలక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్డు నిర్మాణపనులను బుధవారం చైర్మన్ కొండల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో అభివృద్ధిపనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్య క్రమంలో చైర్మన్‌తో పాటు కౌన్సిలర్ జి.మహేశ్ కురుమ, నాయకులు అబ్బవతి నర్సింహ, సామల బుచ్చిరెడ్డి, ఎ.స్వామి, ఎ.బాల్‌రెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ మల్లేశంగుప్తా

## దళారులను ఆశ్రయించి ఆగం కావద్దు

### పాపన్నపేట సహకార సంఘం చైర్మన్ మల్లేశం గుప్తా

**పాపన్నపేట, నవంబరు 6, ప్రభాతవార్త:** ధాన్యాన్ని దళారులకు అమ్ముకుని ఆగం కావద్దని పాపన్నపేట సహకార సంఘం చైర్మన్ మల్లేశం గుప్తా సూచించారు. బుధవారం మండల కేంద్రమైన పాపన్నపేటలో రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంను మల్లేశం గుప్తా ప్రారంభించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం రైతులు పండించిన దొడ్డు, సన్నాల ధాన్యం కొనుగోలుకు వేరు వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. తాళ్లు, పొల్లు లేకుండా తేమ శాతం ఎక్కువగా లేకుండా ధాన్యాన్ని కేంద్రానికి తీసుకురావాలని రైతులకు మల్లేశం గుప్తా సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గురుమూర్తిగౌడ్, తహసీల్దార్ సతీష్, ఎంపిడిఓ విష్ణువర్ధన్, డైరెక్టర్లు రాజేశ్వర్, మల్లన్న, మాజీ ఎంపిటిసి సభ్యుల ఆకుల శ్రీనివాస్, శ్రీకాంతప్ప, నరేందర్‌గౌడ్, శివయ్య, కిష్టయ్య, భూమాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## యోగతో ఆరోగ్యవంతమైన మేధో సమాజం

### -సూపర్ బ్రెయిన్ యోగ నిపుణులు ఆందే జీవన్‌రావు


మాట్లాడుతున్న ఆందే జీవన్‌రావు

**అల్లాదుర్గం, నవంబరు 6, ప్రభాతవార్త:** నిత్యం యోగాతో ఆరోగ్యవంతమైన మేదో సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని సూపర్‌బ్రెయిన్ యోగ నిపుణులు ఆందే జీవన్‌రావు అన్నారు. మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం బ్రెయిన్ యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సూపర్ బ్రెయిన్ యోగ నిపుణులు, నిజామాబాద్ జిల్లా రిటైర్డ్ ఇంటర్మీడియట్ విద్యాధికారి ఆందే జీవన్‌రావు హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సూపర్ బ్రెయిన్ ఓగాను ప్రతి నిత్యం ప్రార్థన సమయంలో విద్యార్థులచే చేయించాలని, ఫలితంగా విద్యార్థి లోకం సమగ్రాభివృద్దికి దోహదపడవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే 14 రౌండ్ల సూపర్ బ్రెయిన్ యోగా చేయించారు. విద్యార్థులు లేవనెత్తిన పలు ప్రశ్నలకు జీవన్‌రావు నివృతి చేశారు. కార్యక్రమంలో వక్త నరసింహారెడ్డి, ప్రిన్సిపాల్ యు తుకారాం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## టిపిటిఎఫ్ మండల కార్యవర్గం

**పుల్‌కల్, నవంబరు 6, ప్రభాతవార్త:** పుల్‌కల్ మండల టిపిటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా బబి రామక్రిష్టయ్య (పుల్‌కల్ జడ్పీహెచ్ఎస్), ప్రధాన కార్యదర్శిగా యం శ్రీకాంత్ (ప్రాథమిక పాఠశాల ముద్దాయిపేట)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా జి సుభాష్‌బాబు, రాష్ట్ర పరిశీలకులుగా ఎం సోమశేఖర్‌ల సమక్షంలో కార్యవర్గాన్ని నియమించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, సంఘ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని రామక్రిష్టయ్య, శ్రీకాంత్‌లు పేర్కొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎఎస్ఐ

**అల్లాదుర్గం, నవంబరు 6, ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సి న అవసరం ఉందని ఎఎస్ఐ దేవిదాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన అల్లాదుర్గం మెయిన్‌రోడ్డు చౌరస్తాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ దేవిదాస్ మాట్లాడుతూ అపరిచితుల నుంచి ఎస్ఎంఎస్, ఈ మేయిల్స్, వాట్సప్‌లు ద్వార వచ్చే బ్లూ కలర్ లింక్‌లను ఎట్టిపరిస్థితుల్లోనే క్లిక్ చేయరాదని, క్లిక్‌చేస్తే తమ మొబైల్‌లోని డేటా మొత్తం సైబర్ నేరగాళ్లకు చేతుల్లోకి పోతుందని గుర్తు చేశారు. సైబర్ నేరాలకు గురియితే వెంటనే 1930కు సమాచారం అందించాలని సూచించారు.మాదక ద్రవ్యాల వినియోగంతో కలిలే కష్టనష్టాలు, ఆనోరోగ్యలపై వివరించారు. రోడ్డు రహదారి నిబంధనలు ప్రతి ఒక్కరు పాటిస్తూ ప్రయాణించాలని సూచించారు. ఇంటి బయటికి వెళ్లిన వారి కోసం కుటుంబ సభ్యులు ఎదరు చూస్తూ ఉంటారన్న నిజాన్ని గుర్తించి రోడ్డుపై నిదానంగా ప్రయాణించాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు, ఆటో డ్రైవర్లు, పోలీసు సిబ్బంది నవీన్‌కాంత్, అర్షద్ తదితరులు పాల్గొన్నారు.


సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎఎస్ఐ దేవిదాస్


కొత్తూర్‌లో సమగ్ర సర్వేను ప్రారంభిస్తున్న సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

## ఇంటింటి సర్వేను ప్రారంభించిన చైర్మన్ గిరిధర్‌రెడ్డి

**జహీరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త:** ఇంటింటి సామాజిక సర్వేను సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి మండల పరిధిలోని కొత్తూర్‌లో ఇంటటికి స్టిక్కరు అంటించి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఎన్యూరమేటర్లు చేరుకుని పలు అంశాలపై వివరాలు సేకరిస్తారని, ప్రజలు అధికారులకు అందుబాటులో ఉండి వివరాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ మహేందర్‌రెడ్డి, టిఎస్ఐడిసి మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ జగన్ మోహన్, కాంగ్రెస్ నాయకులు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

## ఇంటింటి సర్వేలో తప్పులు లేకుండా చూడాలి : ఎమ్మెల్యే

**ఝరాసంగం, నవంబరు 6, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌తో కలిసి ఇంటింటి సర్వేను (సామాజిక, ఆర్థిక విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే) ప్రారంభించారు. సర్వేను నిర్వహించే తీరును ప్రత్యేక అధికారి, ఎంపిడిఓ, తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. సర్వే చేసిన అనంతరం ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో తప్పిదాలు దొర్లాయని, అందుకు జాగ్రత్తగా నమోదు చేసేలా చూడాలని సూచించారు. కుటుంబ సభ్యుల వివరాలు గోప్యంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, మాజీ అధ్యక్షులు బొగ్గుల సంగమేశ్వర్, మాజీ కేతకి ఆలయ చైర్మన్ నర్సింహగౌడ్, పట్టణ అధ్యక్షుడు ఏజాజ్ బాబా, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు జగదీశ్వర్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు, మండల ప్రత్యేక అధికారి లలితకుమారి, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపిడిఓ సుధాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు హన్మంతరావుపాటిల్, మాజీ ఎంపిటిసి సభ్యులు రజిని ప్రియ సంతోష్ పాటిల్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

**పిహెచ్‌సిని సందర్శించిన ఎమ్మెల్యే**


ఝరాసంగంలో పిహెచ్‌సిని సందర్శిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**ఝరాసంగం, అక్టోబరు 6, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సందర్శించారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించి రోగులకు అందచేస్తున్న వైద్య సేవలపై డాక్టర్‌ను ఎమ్మెల్యే అడిగితెలుసుకున్నారు. రోగులకు ఇబ్బందులు కల్గకుండా వైద్య సేవలు అందించాలని సూచించారు. సిబ్బంది క్రమ తప్పకుండా సమయ సారిణి పాటిస్తూ విధులకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మాజీ అధ్యక్షులు బొగ్గుల సంగమేశ్వర్, మాజీ కేతకి ఆలయ కమిటి చైర్మన్ నర్సింహగౌడ్, పట్టణ అధ్యక్షులు ఎజాజ్ బాబ, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు బొగ్గుల జగదీశ్వర్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన డిసిసి ప్రధాన కార్యదర్శి

**మనూర్, నవంబరు 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎన్‌హుక్రానలో వెంకట్‌రెడ్డి కుమారుడు, కుమార్తెల నూతన వస్త్రాధారణ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు రాంరెడ్డి, పండరిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మస్తాన్, లక్ష్మణ్ నాయక్, బి రాజు, లోకేష్, అల్లబక్షి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## గాణగాపూర్‌కు బయలెక్కిన భక్తులు

**మనూర్, నవంబరు 6, ప్రభాతవార్త:** మహారాష్ట్రలోని పుణ్యక్షేత్రమైన గణగాపూర్ ఆలయానికి మనూర్‌తోపాటు మండలంలోని దోసపల్లి, బాధల్‌గావ్, దవ్వూర్ తదితర గ్రామాల నుంచి భక్తులు పాదయాత్రన పయనమయ్యారు. గత ఏడు సంవత్సరాలుగా ఆయా గ్రామాల నుంచి భక్తులు గణగాపూర్‌కు చేరుకుని దత్తాత్రేయుడిని దర్శించుకుంటూ వస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం దోసపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మహాపాద యాత్రగా గణగాపూర్‌కు భజనలు చేస్తూ బయలెక్కారు. కార్యక్రమంలో బిరధర్ దత్తు, అమృత్, నర్సింలు, కుశప్ప, శరణప్ప, వీరన్న, రాజు, నగేష్, ఉమేష్, జగన్నాథ్ తదితర భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

## విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

**ఝరాసంగం, నవంబరు 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చీలేపల్లి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు వై అమృత్ తన స్వంత డబ్బులతో విద్యను అందుకుంటున్న 30 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు ప్లేట్‌లను బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అమృత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యను విద్యార్థులు అందుకోగలుగుతారని గుర్తు చేశారు. గతంలో తను విద్యార్థులకు నోట్ బుక్స్, ఇతర సామాగ్రి అందచేశానని గుర్తు చేశారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మనెమ్మ, ప్రధానోపాధ్యాయులు సుమలత, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా టిపిటిఎఫ్ మండల కార్యవర్గం

**చౌటకూరు, నవంబరు 6, ప్రభాతవార్త:** మండల టిపిటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా వరాల గోపికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎం శ్రీకాంత్‌గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా జి సుభాష్‌బాబు, రాష్ట్ర పరిశీలకులుగా ఎం సోమశేఖర్‌ల సమక్షంలో కార్యవర్గాన్ని నియమించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, సంఘ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని వరాల గోపికృష్ణ, శ్రీకాంత్‌గౌడ్‌లు పేర్కొన్నారు.

## నీటిలో మునిగి వివాహిత మృతి

**పాపన్నపేట, నవంబరు 6, ప్రభాతవార్త:** ప్రమాదావశాస్తు నీటిలో మునిగి వివాహిత మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామ శివారులోని కొత్తకుంటలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన పాపన్నపేటకు చెందిన ఉప్పరి విఠల్, భవానిలు జీవనోపాధి కొరకు భవాని(33) స్వగ్రామమైన లక్ష్మీనగర్‌లో పాలేరుగా ఉంటూ జీవనం సాగిస్తోందన్నారు. సోమవారం ఉదయం భవాని గ్రామ శివారులోని కొత్త కుంటలో బట్టలు ఉతికేందుకువెళ్లి బట్టలు ఉతికి స్నానం ఆచరించేందుకు యత్నిస్తున్న తరుణంలో ప్రమాదావశాస్తు నీటిలో మునిగి భవాని మృతి చెందిందన్నారు. బట్టలు ఉతికేందుకు చెరువుకు వెళ్లిన భవాని ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కుంట వద్దకు వెళ్లి పరిశీలించగా కుంటలో భవాని మృతి దేహం తేలిఆడుదూ కానవచ్చిందన్నారు. విషయం తెలుసుకున్న పాపన్నపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కుంటలో నుంచి వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. మృతురాలి సహోదరుడు నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు.